సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



వైభవం.. పుష్పయాగం

దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి పుష్పయాగం నిర్వహించారు. - 8లో



బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిని అరెస్ట్ చేయాలి

దేవపట్లకు చెందిన బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిని అరెస్టు చేయాలని ఓపీడీఆర్ సహాయ కార్యదర్శి డిమాండ్ చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.220
రెండోరకం	రూ.90	రూ.168

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 199 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

క్షయవిభాగం తనిఖీ



క్షయవిభాగాన్ని తనిఖీ చేస్తున్న టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్

మదనపల్లె : మదనపల్లె క్షయవిభాగం, పట్టణ ఆరోగ్య కేంద్రాలను టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీబీ కేంద్రాల్లో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. టీబీ పరీక్షలు పూర్తిగా ఉచితమని, టీబీ నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని తెలిపారు. టీబీ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో టీబీ నిర్ధారణకు ఉచిత గళ్ల పరీక్షలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. క్షయనిర్ధారణ అయిన రోగుల ఇళ్లను ఆరోగ్యకేంద్రాల హెల్త్‌సెక్రటరీలు సందర్శించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. డాక్టర్ల నిరంతర పర్యవేక్షణ ఉంచాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్యకేంద్రాల డ్రైవర్లు జెరుషా, సల్మాన్, సూపర్‌వైజర్ ప్రభాకర్, సిబ్బంది సుశీల, వనజకుమారి పాల్గొన్నారు.

రూ.8.12 లక్షల హుండీ ఆదాయం



హుండీకానుకలు లెక్కిస్తున్న భక్తులు

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపు జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కెఆర్‌మల్లిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈఓ రమణల ఆధ్వర్యంలో జరిగిన హుండీ లెక్కింపులో మూడు మాసాల కాలంలో రూ.8,12,570లు ఆదాయం వచ్చింది. భక్తులు హుండీద్వారా చెల్లించిన కానుకల ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుజాత, కొండకిట్టా తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు నివారించడమే లక్ష్యం

పీలేరు రూరల్ : జిల్లా వ్యాప్తంగా అగ్నిప్రమాదాలు నివారించడమే తమ లక్ష్యమని జిల్లా అగ్నిమాపక అధికారి పి. అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం పీలేరు అగ్నిమాపక కేంద్రాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వేసవికాలంలో ఎక్కువగా అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వంటగ్యాస్ వాడకంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్ రైలు ఆగేనా!

- నేడు పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్
- రైల్వేల పరంగా కేటాయింపుల కోసం జిల్లా వాసుల ఎదురుచూపులు



రాజంపేట: పార్లమెంట్‌లో నేడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఏటా ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలో రైల్వేలకు అనుకున్న స్థాయిలో నిధులు కేటాయించడం లేదు. గత బడ్జెట్‌లో కేవలం పాత ప్రాజెక్టులకే నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నారు. దక్షిణ మధ్య రైల్వేలో ఆదాయపరంగా ముందంజలో ఉన్నా రైళ్ల కేటాయింపులోగానీ, పొడిగింపుల్లో కానీ తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఈ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నత్తనడకన సాగుతున్న ప్రాజెక్టులు

కడప–బెంగళూరుల మధ్య కొత్త ప్రాజెక్టుకు 2008–09లో ప్రణాళికలు తయారు చేసి రూ.2706 కోట్లు కేటాయిస్తూ పనులు ప్రారంభించారు. మొత్తం 255 కి.మీల పొడవు కల్గిన ఈ మార్గంలో ఇప్పటివరకు కేవలం 21 కి.మీలు కడప–పెండ్లిమర్రి మార్గం మాత్రమే పూర్తయింది. గత బడ్జెట్‌లో రూ.289 కోట్లు కేటాయించారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పట్టుబట్టి దక్కించుకున్న ఈ ప్రాజెక్టు పూర్తయితే కడప, అనంతపురం జిల్లా వాసులకు బెంగళూరు నగరం మరింత దగ్గర వుతుంది.

కలగానే బాలాజీ డివిజన్ ప్రతిపాదన

డివిజన్ కేంద్రంగా తిరుపతిని చేస్తే కాట్పాడి నుంచి గుంతకల్, నెల్లూరులో గూడూరు , వైఎస్సార్, అన్నమయ్య జిల్లా పరిధిలో 700 కిలోమీటర్ల దూరం వస్తుంది. 400 కిలోమీటర్ల పరిధి ఉంటే డివిజన్‌గా ప్రకటించవచ్చని రైల్వే నిపుణులు అంటున్నారు. బాలాజీ డివిజన్ ఏర్పాటైతే అనుకూలంగా ఉంటుందని నివేదికలు ఉన్నాయి. ఇందులో తిరుపతి–గూడూరు (92.96కి.మీ), తిరుపతి–కాట్పాడి (104.39కి.మీ), పాకాల–మదనపల్లె (83కి.మీ), రేణిగుంట–కడప (125 కి.మీ)లైను కలిపే అంశాన్ని గతంలోనే రైల్వే అధికారులు పరిశీలించారు.

బడ్జెట్‌లో ఆమోదం..సర్వేకే పరిమితం

- కడప–గుంతకల్లు–బళ్లారి
- కంభం–ప్రొద్దుటూరు
- భాకరాపేట–గిద్దలూరు
- ముద్దనూరు–ముదిగుబ్బ

నందలూరు రైల్వేకు ఏదీ పూర్వవైభవం

నందలూరు రైల్వేకు పూర్వవైభవం కోసం ఐకేపీఎస్ ఆధ్వర్యంలో యూపీఏ పాలన హయాంలో చేపట్టిన ఉద్యమం దేశరాజధాని ఢిల్లీకి చేరుకుంది. అప్పటి రైల్వేమంత్రి లాలూప్రసాద్ కూడా రాజ్యసభలో నందలూరులో రైల్వే ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఆ తర్వాత ఈ ప్రతిపాదనలు అటకెక్కాయి.

మాట తప్పిన బీజేపీ నేతలు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నందలూరు రైల్వే పూర్వ వైభవం కోసం కృషిచేస్తామన్న బీజేపీ అగ్రనేతలు ఆ తర్వాత అధికారంలోకి వచ్చాక ఈ సమస్యను విస్మరించారు. పరిశ్రమ కాదు..ఉన్న రన్నింగ్ స్టాఫ్ క్రూసెంటర్‌ను, వివిధ రైళ్లకు ఉన్న స్టాపింగ్స్‌ను కూడా ఎత్తివేసే క్రమంలో రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి.

స్టాపింగ్స్‌కు ఎర్నింగ్ అడ్డంకి..

పలురైళ్ల స్టాపింగ్స్‌కు ఎర్నింగ్స్‌ను అడ్డంకిగా చూపుతున్నారు. ప్రజాసేవను దూరంపెట్టేసింది. కేవలం లాభార్జన పరంగా ముందుకువెళ్లడంతో పలురైళ్లు జిల్లా వాసులకు దూరమయ్యాయి. కమలాపురం, రాజంపేట, నందలూరు, రైల్వేకోడూరుతో పాటు కొన్ని నియోజకవర్గ కేంద్రాలలో కూడా కొన్ని రైళ్ల స్టాపింగ్‌కు ఎర్నింగ్ అడ్డంకిగా చూపుతున్నారు.

పుణ్యక్షేత్రాల స్టేషన్లపై శీతకన్ను

జిల్లాలో ఉన్న పుణ్యక్షేత్రాల రైల్వేస్టేషన్లపై రైల్వేశాఖ శీతకన్ను వేసింది. రాష్ట్ర విభజన తర్వాత పుణ్యక్షేత్రంగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్స్ లేదు. అలాగే మరో పుణ్యక్షేత్రమైన నందలూరు(సౌమ్య నాథాలయం) స్టేషన్‌లో కూడా తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రల రాజధానుల నుంచి నడిచే ఎక్స్‌ప్రెస్‌రైళ్లకు స్టాపింగ్స్ లేవు. ఈ పుణ్యక్షేత్రాలకు దూరప్రాంతాల నుంచి వచ్చే రైలు ప్రయాణికులకు సౌకర్యం కల్పించడంలో రైల్వేశాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. కనీసం బుధవారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ లోనైనా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు రైల్వే పరంగా కొద్దివరకైనా న్యాయం జరుగుతుందో లేక మళ్లీ మొండి చేయి చూపుతారో వేచి చూడాల్సిందే.

కన్నెత్తిచూడని కొత్తరైళ్లు..

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాను కలుపుతూ నెల్లూరుకు డైలీ డెమో రైలును తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.
- విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, రాపూరు, ఓబులవారిపల్లె, రాజంపేట, నందలూరు మీదుగా కడప వరకు ఎక్స్‌ప్రెస్ రైలును తీసుకువస్తే అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.
- పెన్నా ఎక్స్‌ప్రెస్ పేరుతో హిందుపూరం నుంచి వయా ధర్మవరం, అనంతపురం గుత్తి, డోన్, నంద్యాల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కడప, నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె మీదుగా నెల్లూరు వరకు రైలును తీసుకొస్తే సీమలోని కడప, అనంతపురం, నెల్లూరు జిల్లా మధ్య రాకపోకలకు సులభమవుతుంది.
- నంద్యాల–కడప మధ్య నడిచే డెమో ఎక్స్‌ప్రెస్ రైలును రేణిగుంట వరకు పొడిగింపు నిర్ణయం తీసుకున్నా ఇంతవరకు అమలుకాలేదు.
- ముంబయి–చెన్నై రైలు మార్గంలో రాత్రి వేళలో నడిచే నైన్ మెయిల్, టెన్ మెయిల్ రైళ్లు ఇప్పుడు లేకుండా చేశారు. పగటిపూట మాత్రమే అడపాదడపా రైళ్లు నడుస్తున్నాయి..
- మచిలీపట్నం–తిరుపతి మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును కడప వరకు పొడిగించే ప్రతిపాదన కార్యరూపందాల్చేలా చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

జిల్లాలు: వైఎస్సార్, అన్నమయ్య
ప్రధానరైల్వేకేంద్రం: నందలూరు
ప్రధానస్టేషన్లు: కడప, ఎర్రగుంట్ల, ఓబులవారిపల్లె
ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలమీదుగా నడిచే రైళ్లు: 30 (డౌన్, అప్)
గూడ్స్‌రైళ్లు: 40
స్టేషన్లు: 25
కార్మికులు: 4000
కిలోమీటర్లు: 180



పరిశ్రమల స్థాపనతోనే జిల్లాలో ప్రగతి

- జిల్లాలో 41 యూనిట్లకు రూ.3.24 కోట్ల మేర రాయితీలు మంజూరు
- జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా



పరిశ్రమల ఏర్పాటుపై అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా

రాయచోటి: జిల్లా ప్రగతికి పరిశ్రమలే ఆయువుపట్టు అని జిల్లా జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా అభిప్రాయపడ్డారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో మినీ వీసీ హాలులో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన పారిశ్రామిక అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఆ దిశగా జిల్లా అధికారులు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలలో ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా పరిశ్రమలశాఖ అధికారులు, బ్యాంకు అధికారులు దృష్టి సారించాలన్నారు. ఇందులో వివిధ కేటగిరీలకు సంబంధించి జిల్లాలో మొత్తం 1431 దరఖాస్తులు అందగా ఇప్పటి వరకు 1379 దరఖాస్తులకు ఆమోదం తెలిపామన్నారు. 41 యూనిట్లకు గాను కేటగిరీల వారిగా ప్రోత్సాహక రాయితీగా రూ. 3.24 కోట్లు విడుదలైనట్లు వివరించారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారి జి గోపాల్, కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ నారాయణరెడ్డి, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ మునిశంకరయ్య, సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి జాకీర్ హుస్సేన్, టిక్కీ ప్రతినిధి ఎం రామమూర్తి నాయక్, విద్యుత్ శాఖ డీఈ చంద్రశేఖర్ రెడ్డి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



గ్రామ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

కలెక్టర్ గిరీషా పీఎస్

పీలేరు: గ్రామ సచివాలయానికి వచ్చే ప్రజలకు సిబ్బంది మెరుగైన సేవలందించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. మంగళవారం పీలేరు మండలంలోని బోడుమల్లువారిపల్లె, వేపులబైలు గ్రామ సచివాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు జాప్యం లేకుండా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించినప్పుడే ప్రజలకు మనపై నమ్మకం కలుగుతుందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు వెంటనే మెరుగైన నష్ట పరిహారం అందేలా చూస్తామన్నారు. మ్యుటేషన్ దరఖాస్తులు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్‌లు డాక్టర్ హబీబ్‌బాషా, జయలక్ష్మీదేవి, తహసీల్దార్ రవి, ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా మరణాలపై పూర్తిస్థాయి విచారణ

ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

మదనపల్లె : పట్టణంలోని నీరుగట్టువారిపల్లె పాత ఊరులో నాటుసారా తాగి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని, సారా నియంత్రణకు అవసరమైన పటిష్టచర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. మంగళవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మదనపల్లె సబ్‌డివిజన్‌లో నాటుసారా కట్టడికి ఎస్ఈబీ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహిస్తూ నివారణకు గట్టిచర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డివిజన్ పరిధిలో జనవరిలో 92 సారా కేసులు నమోదు కాగా, 56మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 407 లీటర్ల సారా స్వాధీనంతో పాటు 17,910 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామన్నారు. గతేడాది 1,765 మద్యం కేసులు నమోదుకాగా, 9,039 మందిని అరెస్ట్ చేశామన్నారు. ఈ ఏడాదిలో సారా కేసులు పెరిగే అవకాశం ఉందని వివరించారు. జిల్లాలో 97 ప్రాంతాలను సారారహిత గ్రామాలుగా గుర్తించామని, సారా కేసుల్లో పదేపదే పట్టుబడుతున్న నిందితులపై పీడీ యాక్ట్ నమోదుచేయడంతో పాటు ఏడుగురు ముద్దాయిలకు నగర బహిష్కరణ చేసినట్లు ఎస్పీ తెలిపారు. 230 ప్రాంతాల్లో సారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి దాడులు చేస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మురళీకృష్ణ, సత్యనారాయణ, సాదిక్‌అలీ, శివాంజనేయులు, ఎస్ఐలు చంద్రమోహన్, హరిహరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

సోమవారం రాత్రి నాటుసారా తాగి ఇద్దరు వ్యక్తులు మరణించిన నీరుగట్టువారిపల్లెలోని పాత ఊరు పుల్లారెడ్డివీధి పరిసరాలను ఎస్పీ పరిశీలించారు. స్థానికులను, బంధువులను జరిగిన ఘటనపై ఆరా తీశారు. స్థానిక సారా విక్రేతల వివరాలను సేకరించారు. అనంతరం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ సారా మరణాలపై సమగ్ర విచారణ చేస్తున్నామన్నారు. ఎస్పీ పరిశీలన తర్వాత పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు. ఘటనపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుణాల రికవరీ వంద శాతం పూర్తి చేయండి

డీపీఎం లక్ష్మీ ప్రసాదర్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం: స్త్రీ నిధి రుణాల రికవరీ వంద శాతం పూర్తి చేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) లక్ష్మీ ప్రసాదర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సంఘమిత్రల సమావేశం నిర్వహించారు. ఆయనతో పాటు స్త్రీ నిధి మేనేజర్ వేణుగోపాల్, ఏరియా కోఆర్డినేటర్ సురేష్ కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి, ఏపీఎం సాంబశివ మాట్లాడుతూ మండలంలోని తుమ్మరకుం వన్, పట్టెంవాండ్లపల్లి త్రీ, పులికల్లు పంచాయతీల్లో రుణాల రికవరీలో చాలా వెనుకబడి ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోనే రూ.3 కోట్ల రుణాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బ్యాంకు లింకేజీ వంద శాతం పూర్తి చేసినట్లు స్త్రీ నిధి రుణాలను కూడా గడువులోగా చెల్లించాలన్నారు. ఆరవ విడత జగనన్న తోడుకు సంబంధించి వారం లోగా లబ్ధిదారుల వివరాలను సేకరించాలన్నారు. ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్నలు మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు.

ఎస్‌పీఎల్ ఆరంభం.. అదరహో..!



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా, చిత్రంలో వైఎస్సార్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తదితరులు

క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో సాక్షి ప్రీమియర్ లీగ్ ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ వేడుకలకు విచ్చేసిన ముఖ్యఅతిథులు పచ్చిక మైదానంపై బ్యాటింగ్, బౌలింగ్ వేసి యువ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపగా... క్రీడాకారుల కరతాళ ధ్వనుల మధ్య మంగళవారం సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్–4 అట్టహాసంగా ప్రారంభమైంది.

- ఉత్సాహంగా ప్రారంభమైన సాక్షి ప్రీమియర్ లీగ్ 4వ సీజన్
- ఓటమి నుంచి గెలుపునకు బాటలు వేసుకోవాలి : డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాలు వేదికగా సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్–4 ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. నగరంలోని కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా, విశిష్ట అతిథిగా జిల్లా ఎస్పీ కె.కె.ఎన్. అన్బురాజన్, గౌరవ అతిథిగా కందుల విద్యాసంస్థల అధినేత కందుల చంద్ర ఓబులరెడ్డి (నాని) విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు ఒక చక్కటి వేదిక సాక్షి ప్రీమియర్ లీగ్ అన్నారు. జిల్లా నుంచి పైడికాల్వ విజయ్‌కుమార్, హరిశంకర్‌రెడ్డి లాంటి క్రీడాకారులు ఐపీఎల్‌కు ప్రాతినిధ్యం వహించారని, వారిని ఆదర్శంగా తీసుకుని క్రికెట్‌లో రాణించాలని సూచించారు. ఇలాంటి లీగ్ పోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడాకారులకు చక్కటి అవకాశాలు లభిస్తాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఓటమి నుంచి విజయానికి బాటలు వేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం క్రీడలకు చక్కటి ప్రోత్సాహం అందిస్తోందన్నారు.

మైదాన క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి : ఎస్పీ కె.కె.ఎస్. అన్బురాజన్

ప్రస్తుత టెక్నాలజీ యుగంలో యువత సెల్‌ఫోన్ గేమ్స్ వదిలి.. మైదాన క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని జిల్లా ఎస్పీ కె.కె.ఎన్. అన్బురాజన్ కోరారు. ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన క్రీడను ఎంపిక చేసుకుని అందులో నైపుణ్యం సాధించి రాణించాలని సూచించారు. ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. సాక్షి ప్రీమియర్ లీగ్‌కు చక్కటి స్పందన రావడం అభినందనీయమన్నారు. ప్రతిరోజూ సాధన చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించగలరని పేర్కొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం : కందుల నాని

విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలకు తగినంత సమయం కేటాయించాలని కందుల విద్యాసంస్థల అధినేత కందుల చంద్ర ఓబులరెడ్డి (నాని) అన్నారు. ప్రస్తుత పోటీప్రపంచంలో అందరూ ఒత్తిడి ఎదుర్కొంటున్నారని, ఒత్తిడిని తగ్గించుకునేందుకు చక్కటి మార్గం క్రీడల్లో పాల్గొనడమేనన్నారు. సాక్షి యాజమాన్యం యువతలోని ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు సాక్షి ప్రీమియర్ లీగ్ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా బ్యాటింగ్, బౌలింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో సాక్షి యూనిట్ మేనేజర్ సి. హరినాథరెడ్డి, అడ్వర్‌టైజ్‌మెంట్ రీజినల్ మేనేజర్ డి. సుబ్బారెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి ఎం. బాలకృష్ణారెడ్డి, డిప్యూటీ చీఫ్ సబ్ ఎడిటర్ ఎస్. మహమూద్‌బాషా, స్టాఫ్ రిపోర్టర్ బి.వి.నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరెంట్ షాక్‌తో చేనేత కార్మికురాలికి గాయాలు

మదనపల్లె : చేనేత కార్మికురాలికి కరెంట్ షాక్‌తో తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె రామిరెడ్డిలేఅవుట్‌కు చెందిన చేనేత కార్మికుడు రమేష్ భార్య భారతి చేనేత కార్మికురాలిగా పని చేస్తోంది. పవర్‌లూమ్‌లో చీర నేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌కు గురైంది. ప్రమాదంలో గాయపడగా, స్థానికులు గుర్తించి బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం ఆమె కోలుకుంది.

కర్ణాటక మద్యం విక్రేతల అరెస్ట్

మదనపల్లె : కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని నక్కలదిన్నెకు చెందిన డి.రమ్య(40) వద్ద 40 కర్ణాటక మద్యం బాటిల్స్, అదే ప్రాంతానికి చెందిన లాలెమ్మ(51) వద్ద 25 కర్ణాటక మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

వృద్ధుడు అదృశ్యం

కలికిరి : మండలంలోని గట్టుపాళెం గ్రామం జంగంపల్లికి చెందిన ఎస్.వీరాస్వామి(74) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రఫీ తెలిపారు. వీరాస్వామి గత నెల 25న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆయన కుమారుడు శివశంకర్ పోలీసులను ఆశ్రయించాడు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని పోలీసులు పేర్కొన్నారు.

అప్పు తీర్చలేదని దాడి

కురబలకోట : తీసుకున్న అప్పును తీర్చలేదన్న కారణంగా యువకుడిపై ముగ్గురు యువకులు విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచిన సంఘటన కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. బాధితుడు మంగళవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చేనేతనగర్‌కు చెందిన సి.విశ్వనాథ గౌనివారిపల్లెకు చెందిన ఒకరి వద్ద అప్పు చేశాడు. అప్పు గురించి అడిగితే సమాధానం చెప్పకుండా విశ్వనాథ వెళ్లిపోయాడు. దీంతో అదే ఊరికి చెందిన నవీన్, అమరతోపాటు మరొకరు చేనేతనగర్‌లోని విశ్వనాథ ఇంటికి రాత్రి వెళ్లి డబ్బులు ఇస్తావా.. లేదా అంటూ దాడి చేశారు. గాయపడ్డ విశ్వనాథ మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు పోలీసులు తెలిపారు.

ఉరిమే ఉత్సాహం.. ఎస్‌పీఎల్

SAKSHI · SAKSHI DIGITAL MEDIA GROUP · SPL SAKSHI PREMIER LEAGUE

కడప నగరంలోని కేఎస్‌ఆర్‌ఎం, కేఓఆర్‌ఎం క్రికెట్ మైదానాల్లో మంగళవారం నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ పోటీల్లో క్రీడాకారులు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో రాణించి సత్తా చాటారు. యువ క్రీడాకారుల బ్యాటింగ్ జోరుతో.. మైదానం హోరెత్తింది.. బౌలింగ్ మాయాజాలంతో ప్రత్యర్థుల జట్లను ముప్పు తిప్పలు పెట్టగా.. ఫీల్డింగ్‌లో సైతం యువ క్రీడాకారులు చక్కటి ప్రదర్శన కనబరిచారు. మ్యాచ్ విన్నర్‌లు కేరింతలతో సందడిచేశారు. మ్యాచ్‌లు ఆద్యంతం రసవత్తరంగా సాగాయి. – కడప స్పోర్ట్స్



బ్యాటింగ్ చేపట్టి క్రికెట్ పోటీలు ప్రారంభించిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



విజయోత్సాహంలో క్రీడాకారులు

నేటి మ్యాచ్‌ల వివరాలు..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో..

ఉదయం 9 గంటలకు : రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల, బద్వేలు – కేఎస్‌ఆర్‌ఎం ఎంబీఏ కళాశాల, కడప

ఉదయం 11 గంటలకు : శ్రీహరి డిగ్రీ కళాశాల–1, కడప, –పాలకొండ్రాయ డిగ్రీ కళాశాల, ఓబులవారిపల్లె

మధ్యాహ్నం 2 గంటలకు : ట్రిపుల్ ఐటీ, ఇడుపులపాయ – ఎస్.బి.వి.ఆర్. డిగ్రీ కళాశాల, బద్వేలు

కేఓఆర్‌ఎం మైదానంలో..

ఉదయం 9 గంటలకు : నిర్మల ఫార్మసి కళాశాల, కడప –గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల, కడప

ఉదయం 11 గంటలకు : ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల, ప్రొద్దుటూరు– ఎస్.వి. డిగ్రీ కళాశాల, కడప

మధ్యాహ్నం 2 గంటలకు : అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, కడప– శ్రీహరి డిగ్రీ కళాశాల–2, కడప

ప్రొద్దుటూరు పాలిటెక్నిక్ విజయం



విజయం సాధించిన ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ జట్టు

ఉదయం 9 గంటలకు నిర్వహించిన మ్యాచ్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రొద్దుటూరు, ప్రభుత్వ పాలిటెక్నిక్, వేంపల్లి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన వేంపల్లి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ప్రొద్దుటూరు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది. జట్టులోని అస్లాన్ 56 పరుగులు చేశాడు. వేంపల్లి బౌలర్ మనోజ్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వేంపల్లి జట్టు 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసింది. ప్రొద్దుటూరు బౌలర్ అస్లాన్ 2 వికెట్లు తీశాడు. దీంతో ప్రొద్దుటూరు పాలిటెక్నిక్ జట్టు 4 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

రాణించిన ఎస్.కె.ఎస్.సి. కళాశాల జట్టు



జయకేతనం ఎగురవేసిన ప్రొద్దుటూరు ఎస్.కె.ఎస్.సి. జట్టు

ఉదయం 11 గంటలకు నిర్వహించిన మ్యాచ్‌లో ప్రొద్దుటూరు ఎస్.కె.ఎస్.సి. కళాశాల జట్టు, కడప కేఓఆర్‌ఎం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఎస్.కె.ఎస్.సి. జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. జట్టులోని వెంకటేష్ 39 పరుగులు చేశాడు. కేఓఆర్‌ఎం బౌలర్ ఓబులరెడ్డి 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ దిగిన కేఓఆర్‌ఎం జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. జట్టులోని విజయ్‌కుమార్ 20 పరుగులు చేశాడు. ఎస్.కె.ఎస్.సి. జట్టు బౌలర్ కళాధర్ 2 వికెట్లు తీశాడు. దీంతో ఎస్.కె.ఎస్.సి. జట్టు 14 పరుగుల తేడాతో విజయం సాధించింది.

నిలకడగా రాణించిన 'నిర్మల' జట్టు



విజయదుందుభి మోగించిన కడప నిర్మల ఫార్మసీ కళాశాల జట్టు

మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించిన మ్యాచ్‌లో పులివెందుల జేఎన్‌టీయూ జట్టు, కడప నిర్మల ఫార్మసీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నిర్మల జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 9 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. జట్టులోని దినేష్ 50 పరుగులు చేశాడు. జేఎన్‌టీయూ బౌలర్ అమీర్‌బట్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ దిగిన జేఎన్‌టీయూ జట్టు 9 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 51 పరుగులు మాత్రమే చేసింది. నిర్మల జట్టు బౌలర్ ఆదిల్ 2 వికెట్లు తీశాడు. దీంతో నిర్మల ఫార్మసీ జట్టు 44 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

• ఇరగదీసిన ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ



విజయం సాధించిన ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ జట్టు

ఉదయం 9 గంటలకు నిర్వహించిన మ్యాచ్‌లో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ జట్టు, ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రొద్దుటూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ట్రిపుల్‌ఐటీ జట్టు 8 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 99 పరుగులు చేసింది. జట్టులోని అరుణ్ 44 పరుగులు, మధుసూదన 40 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ జట్టు 8 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది. ట్రిపుల్‌ఐటీ బౌలర్ జ్యోతీశ్వర్ 3 వికెట్లు తీశాడు. దీంతో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ జట్టు 35 పరుగుల తేడాతో విజయం సాధించింది.

• వావ్.. వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ



విజయానందంలో కడప వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ జట్టు

ఉదయం 11 గంటలకు నిర్వహించిన మ్యాచ్‌లో సీబీఐటీ ప్రొద్దుటూరు జట్టు, కడప వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసింది. జట్టులోని ఏడుకొండలు 23 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సీబీఐటీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. జట్టులో తరుణ్ కుమార్ 25 పరుగులు చేశాడు. వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ బౌలర్ సంజు 3 వికెట్లు తీశాడు. దీంతో వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ జట్టు 18 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. అనంతరం నిర్వహించిన మరో మ్యాచ్‌లో ఎస్‌ఆర్‌ఐటీ జట్టుకు బై లభించింది.

'ఎర్ర' కూలీల కోసం గాలింపు

కలికిరి : పరారీలో ఉన్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఎర్రచందనం కూలీల కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. తమిళనాడు నుంచి ఓ కారులో చిత్తూరు జిల్లా పలమనేరు మీదుగా అన్నమయ్య జిల్లా కలికిరి, వాల్మీకిపురం మండలాల సరిహద్దుల గుండా అడ్డదారిలో కలకడ వైపు వెళుతున్నట్లు సోమవారం పోలీసులకు సమాచారం అందింది. వారు వెంటనే నిఘా ఏర్పాటు చేశారు. వాల్మీకిపురం మండల పరిధిలో మేకలవారిపల్లి–ఎర్రావాండ్లపల్లి రోడ్డులో కారు వస్తున్నట్లు గుర్తించారు. కూలీలున్న వాహనాన్ని ఛేజ్ చేశారు. పోలీసులను పసిగట్టిన కూలీలు పరారవ్వగా కారుతో సహా డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. పరారైన కూలీల కోసం రెండు పోలీసు బృందాలు గాలిస్తున్నట్లు సమాచారం.

చెక్‌బౌన్స్ కేసులో జైలు శిక్ష

నందలూరు(రాజంపేట) : మాజీ వీఆర్వో రాజశేఖర్‌రెడ్డికి చెక్‌బౌన్స్‌కు సంబంధించి మూడు కేసుల్లో ఒక్కొక్క కేసులో ఏడాదిన్నర జైలుశిక్ష, చెక్కు మొత్తం పరిహారం చెల్లించేలా ఫస్ట్‌క్లాస్ జుడిషియల్ మేజిస్ట్రేట్ కె.లత మంగళవారం తీర్పు ఇచ్చారు. బి.రాజశేఖరరెడ్డి వద్ద రూ.8 లక్షలు, మస్తానయ్య వద్ద రూ.6.30 లక్షలు అప్పుగా తీసుకొన్న నేపథ్యంలో చెల్లింపునకు వారికి మొత్తం మూడు చెక్కులు ఇచ్చారు. ఆ చెక్‌లు బౌన్స్ అయిన కేసులో తీర్పు వెలువడింది. పరిహారం చెల్లించకుంటే ఆరు నెలలు అదనంగా జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ తీర్పు పట్ల ఫిర్యాదిదారులు, న్యాయవాది షమీవుల్లాఖాన్ హర్షం వ్యక్తం చేశారు.

బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిని అరెస్ట్ చేయాలి



బాధిత కుటుంబీకులతో కలసి విలేకరులతో మాట్లాడుతున్న ఈశ్వర్

రాయచోటి అర్బన్ : సంబేపల్లె మండలం దేవపట్లకు చెందిన బాలిక (14)ను కిడ్నాప్ చేసిన యువకుడిని తక్షణమే అరెస్టు చేయాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఈశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద ఆయన బాలిక తల్లిదండ్రులతో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవపట్లలో 9వ తరగతి చదువుతున్న బాలికను అదే గ్రామానికి చెందిన హేమంత్‌కుమార్ (21) అనే యువకుడు మాయమాటలు చెప్పి ఈ నెల 21న తనవెంట తీసుకెళ్లాడన్నారు. ఈ విషయంపై బాలిక తల్లిదండ్రులు సంబేపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ యువకుడిని అరెస్టు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఎస్పీ జోక్యం చేసుకుని హేమంత్‌కుమార్‌పై 366ఏ, పోక్సోచట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని కోరారు. సమావేశంలో ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతిశంకర్, ఉపాధ్యక్షుడు చల్లా రెడ్డెయ్య, అన్నయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితులకు జైలు



శిక్ష పడిన నిందితులను సబ్‌జైలుకు తరలిస్తున్న వన్‌టౌన్ పోలీసులు

మదనపల్లె : ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులకు మదనపల్లె జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బంగారుపేట హెగ్డేకాలనీకి చెందిన బంగారప్ప(25), కోలార్‌కు చెందిన ఫిరోజ్ (25) గత ఏడాదిలో 6 ద్విచక్రవాహనాల చోరీ కేసుల్లో నిందితులుగా పట్టుబడ్డారు. అప్పటి వన్‌టౌన్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ద్విచక్రవాహనాలను వారు చోరీ చేసినట్లు నిర్ధారించి రెండేళ్ల సాధారణ జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితులకు శిక్షపడేలా ఏపీపీలు ఉమాదేవి, రామకృష్ణలు వాదించారని ఎస్‌ఐ తెలిపారు. శిక్ష పడిన ఖైదీలను సబ్‌జైలుకు తరలించారు.

వైభవం.. పుష్పయాగం



పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా

ముగిసిన కడప రాయుని బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : తిరుమల తొలిగడపలో వెలసిన కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో సమాప్తమయ్యాయి. పదిరోజులకు పైగా జరిగిన ఈ ఉత్సవాలలో భాగంగా రాత్రి పుష్పయాగం నిర్వహించారు. దాదాపు రెండు గంటలపాటు కనుల పండువగా జరిగిన ఈ కార్యక్రమం భక్తులను పరవశింపజేసింది.

శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామిని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పీఠంపై ఇరువైపులా దేవేరులతో కొలువుదీరిన కడప రాయునికి ప్రత్యేక పూజలు చేసి పుష్పయాగాన్ని ప్రారంభించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మచ్చా శేషాచార్యులు, మయూరం కృష్ణమోహన్, త్రివిక్రమ్, కృష్ణభట్టర్, పార్థసారథి, కృష్ణమూర్తి సహాయకులతో కలిసి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మల్లెలు, సన్నజాజులు, సంపెంగలు, కలువలు, కనకాంబరాలు, బంతులు, చామంతులు, రోజాలు, పారిజాతాలు తదితర పుష్పాలు, తులసి, మరువం, దవనం లాంటి పరిమళ దళాలు యాగం కోసం ప్రత్యేకంగా బుట్టల కొద్దీ తీసుకొచ్చారు. మంత్రోచ్చాటనల మధ్య ఒక్కో రకం పూలతో స్వామి, అమ్మవార్లను అభిషేకిస్తూ ఎదురుగా, వరుసగా ఆ వేదికపై వాలుగా ఆ పూలను పేర్చారు. పలువురు భక్తులు కూడా ఈ యాగానికి భక్తితో పువ్వులు సమర్పించారు. పూలతోపాటు సేగు, ద్రాక్ష, బత్తాయిలు, కమలాలు, దానిమ్మ తదితర ఫలాలతో పూల మధ్య తిరునామాన్ని తీర్చిదిద్దారు. వాద్య విద్వాంసులు సప్తస్వరాలను ఆలపిస్తుండగా జరిగిన ఈ కార్యక్రమాన్ని తిలకించి భక్తులు ఆనంద పరవశులయ్యారు. పాతకడప, దేవునికడప గ్రామాల పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ పుష్పయాగంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్‌బీ అంజద్‌బాష పాల్గొన్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు సంప్రదాయ స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల దర్శన అనంతరం ఆయన పుష్పయాగంలో పాల్గొని పూలు సమర్పించారు. అర్చకులు ఆయనను ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జిల్లా ఆస్పత్రిలో గర్భిణి మృతి



పుష్ప (ఫైల్)

రామసముద్రం/మదనపల్లె : మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో సోమవారం రాత్రి నిండు గర్భిణి మృతి చెందింది. రామసముద్రం మండలం మట్లవారిపల్లెకు చెందిన రెడ్డిశేఖర్ భార్య పుష్ప(26) కురబలకోట మండలంలోని విశ్వం కళాశాలలో కామర్స్ అధ్యాపకురాలిగా పని చేస్తోంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి రెండో కాన్పు కోసం పురిటినొప్పులతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో పుష్పకు బీపీ, పల్స్‌రేటు పూర్తిగా పడిపోయి కోమాలోకి వెళ్లింది. ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో.. కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి చికిత్సలు అందించేలోపు ఆమె, కడుపులోని బిడ్డ ఇద్దరూ మృతి చెందారు. పుష్పకు మొదటికాన్పులో ఆడబిడ్డ జన్మించింది. రెండో కాన్పు కష్టమై మృతి చెందడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగింది. లెక్చరర్ మృతి సమాచారం తెలుసుకున్న విశ్వం కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి, సహ అధ్యాపకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ద్విచక్రవాహనాల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

మదనపల్లె : ద్విచక్రవాహనాల చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో పోలీసు సిబ్బందితో కలిసి సీఐ మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. పారిపోతున్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారణ చేస్తే ద్విచక్రవాహనాలు చోరీకి పాల్పడుతున్నట్లు తేలింది. నిందితుడు సురేష్(25) శ్రీకాళహస్తి మండలం కెల్లాంబపురానికి చెందిన వాసిగా గుర్తించారు. ఇతడు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతోపాటు ఇళ్ల ముందు ఉంచిన ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడేవాడు. పట్టణంలో 6 ద్విచక్రవాహనాలను దొంగిలించినట్లు నేరం అంగీకరించడంతో అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై తమిళనాడు, అనంతపురం, గోరంట్ల, మదనపల్లె తదితర ప్రాంతాల్లో చోరీ కేసులు నమోదై ఉన్నట్లు సీఐ తెలిపారు.